


అనంతపురం బస్టాండులో బస్సుల రాకకోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

పల్లెకు పోదాం..!



సీటు కోసం..



బరువు.. బాధ్యత..

ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఇంటిబాట పట్టారు. మెరుగైన చదువుకోసం నగరానికి వచ్చి.. ఇరుకు గదుల్లో ఇన్నాళ్లూ గడిపిన పల్లె బిడ్డలు.. పరీక్షలు ముగియగానే స్వేచ్ఛావాయువులు పీల్చుకున్నారు. పెట్టేబేడ సర్దుకుని.. హాస్టల్ గదులను ఖాళీ చేశారు. తమకోసం వచ్చిన నాన్నతో కలిసి.. ఇంటి వద్ద ఉన్న అమ్మను చూసేందుకు ఆత్రంగా బస్సెక్కారు. కానీ ఆర్టీసీ వారు రద్దీకి తగినన్ని బస్సులను ఏర్పాటు చేయలేదు. దీంతో అనంత బస్టాండులో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సులు రాగానే ఎగబడి ఎక్కేశారు. సీట్ల కోసం తంటాలు పడ్డారు. ఇంటికి వెళ్లాలన్న ఆత్రుతలో.. ఎండల తీవ్రతను కాసేపు మరిచిపోయారు.

- అనంతపురం కల్చరల్

టీడీపీ నాయకుడి ఇంటిపై దాడి

నాగసముద్రంలో వైసీపీ వర్గీయుల హల్‌చల్

దండు ఓబులేసు ఇంటిమీదకు అనుచరులతో దాడికి వచ్చిన వైసీపీ కనగానపల్లి మండల కన్వీనర్ అమర్నాథ్ రెడ్డి




దాడికి వచ్చిన వైసీపీ కనగానపల్లి మండల కన్వీనర్ అమర్నాథ్‌రెడ్డి, రామగిరి సీఐ, ఎస్‌ఐకి దాడి గురించిచెబుతున్న దండు ఓబులేసు

చెన్నేకొత్తపల్లి, మార్చి 14: చెన్నేకొత్తపల్లి మండల పరిధిలోని నాగసముద్రం గ్రామంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేసు ఇంటిపై వైసీపీ వర్గీయులు గురువారం రాత్రి దాడికి తెగబడ్డారు. ఓ ఫ్లెక్సీ విషయంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య గురువారం వాగ్వాదం జరిగింది. గ్రామస్థులు సర్దిచెప్పడంతో శాంతించారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆ తరువాత రాత్రి 9-30 గంటల సమయంలో వైసీపీ కనగానపల్లి మండల కన్వీనర్ అమర్నాథ్‌రెడ్డి రెండు వాహనాలలో అనుచరులను వెంట పెట్టుకుని నాగసముద్రానికి చేరుకుని నానా హంగామా సృష్టించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేసు ఇంటిపై దాడికి ప్రయత్నించారు. 'రేయ్.. బయటకు రారా నీ కథేందో తెలుస్తాం' అని బెదిరించారు. 'మా ఊరిలో సమస్య ఉంటే మీరెందుకు వచ్చారు..?' అని దండు ఓబులేసు ప్రశ్నించడంతో అతనిపై దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న ఓబులేసు అనుచరులు, స్థానిక టీడీపీ శ్రేణులు అక్కడికి చేరుకుని వైసీపీ నాయకులపై తిరగబడ్డారు. 'మా నాయకుడి ఇంటిపై దాడిచేస్తారా? మీకెంత ధైర్యం..?' అని నిలదీశారు. దీంతో వైసీపీ నాయకులు వాహనాలలో అక్కడి నుంచి జారుకున్నారు. పోలీసులు గ్రామంలో ఉండగానే వేరే మండలానికి చెందిన వైసీపీ నాయకులు ఏకంగా వాహనాలలో వచ్చి దాడికి ప్రయత్నించడం ఏమిటని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడికి వచ్చినవారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

దండు ఓబులేసు ఇంటి వద్దగుమికూడిన టీడీపీ కార్యకర్తలు



ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే...

ఎన్నికలు సమీపిస్తున్నందున టీడీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేయాలనే ఉద్దేశంతో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి తన ఇంటిపైకి వైసీపీ నాయకులను పంపించారని దండు ఓబులేసు ఆరోపించారు. చిన్న వివాదం జరిగితే పక్క మండలానికి చెందిన అమర్నాథ్‌రెడ్డి అనుచరులతో కలిసి తన ఇంటిపైకి వచ్చారని, తనపై హత్యాయత్నానికి తెగబడ్డారని అన్నారు. గ్రామంలో పోలీసు అధికారులు ఉండగానే దాడికి పాల్పడ్డారంటే దాని వెనుక ఎవరున్నారో స్పష్టంగా తెలుస్తోందని అన్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పరిటాల సునీత.. దండు ఓబులేసుకు ఫోన్ చేసి మాట్లాడారు.

ఇంకా డబ్బు పడలేదు..!

సున్నా వడ్డీ సొమ్ముకోసం రైతుల నిరీక్షణ

సున్నా వడ్డీ సొమ్ము కోసం జిల్లా రైతులు నిరీక్షిస్తున్నారు. ఫిబ్రవరి 28న తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ బటన్ నొక్కారు. 2021- 22 రబీ, 2022 ఖరీఫ్ సీజన్లకు సంబంధించిన సున్నా వడ్డీ సొమ్మును విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లాలో 83,534 మంది రైతులకు రూ.17.25 కోట్ల సొమ్ము రావాల్సి ఉంది. సీఎం జగన్ బటన్ నొక్కి 16 రోజులు గడిచింది. ఇప్పటికీ రైతుల ఖాతాలో సొమ్ము జమ కాలేదు. రైతులు రోజూ బ్యాంకుల వద్దకు వెళ్లి విచారిస్తున్నారు. డబ్బు పడలేదని తెలిసి నిట్టూరుస్తూ వెనుదిరుగుతున్నారు. రెండు మూడు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. కోడ్ అమలులోకి వస్తే సున్నా వడ్డీ సొమ్ము జమ చేస్తారో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- అనంతపురం అర్బన్

సీఎం జగన్ బటన్ నొక్కి 16 రోజులు

జిల్లా రైతులకు రావాల్సింది రూ.17.25 కోట్లు



సున్నా వడ్డీ చెక్కును విడుదల చేస్తున్న జిల్లా యంత్రాంగం (ఫైల్)

లబ్ధిదారుల సంఖ్య కుదింపు

వైసీపీ అధికారంలోకి వచ్చాక సున్నా వడ్డీ పథకానికి శ్రీకారంచుట్టారు. బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతులు, గడువులోగా తిరిగి చెల్లిస్తే సున్నా వడ్డీ వర్తింపజేస్తామని ప్రకటించారు. ఇందులో ఓ మెలిక పెట్టారు. రూ.లక్ష లోపు రుణం తీసుకున్న రైతులకు మాత్రమే సున్నా వడ్డీ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువ శాతం రైతులు వేరుశనగ పంటకు రుణం తీసుకుంటున్నారు. రబీలో పప్పుశనగ, ఇతర పంటలకు తీసుకుంటున్నారు. వేరుశనగకు ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేలకుపైగానే పంట రుణం ఇస్తున్నారు. గడువులోగా తిరిగి చెల్లించే రైతులకు బ్యాంకర్లు అడిగిన మేరకు రుణం ఇస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మూడున్నర ఎకరాలకు పైగా భూమి ఉన్న రైతులకు రూ.లక్షకుపైగానే పంట రుణం అందుతోంది. ఇలాంటి వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం సున్నా వడ్డీ వర్తించడం లేదు. ఈ కారణంగా లక్షలాది మంది రైతులు సున్నా వడ్డీకి దూరవుతున్నారు.



ఇంకా డబ్బు పడలేదు..

2022 ఖరీఫ్‌లో బ్యాంకులో పత్తి పంట సాగు కోసం రూ.70వేలు పంట రుణం తీసుకున్నాను. వ్యవసాయ అధికారులు పత్తి పంట ఈ క్రాపింగ్ చేసుకొని వెళ్లారు. బ్యాంకులో తీసుకున్న రుణం గడువులోగా చెల్లించాను. సీఎం జగన్ సున్నా వడ్డీ డబ్బులు విడుదల చేయడంతో నా ఖాతాలో డబ్బు పడిందేమో అని రోజూ చూసుకుంటున్నాను. ఇంత వరకూ జమకాలేదు. బ్యాంకులో వెళ్లి అడిగితే ఇంకా జమ కాలేదని చెప్పారు. - శ్రీనివాసులు, నిదనవాడ, శింగనమల మండలం

ఎప్పటిలోగా జమ చేస్తారో..?

2022 ఖరీఫ్‌లో వేరుశనగ పంటపై రూ.86 వేలు పంటరుణం తీసుకున్నాను. గడువులోగా తిరిగి చెల్లించాను. ఈ క్రాపింగ్ పూర్తైంది. ఇప్పటి దాకా నా ఖాతాలో సున్నా వడ్డీ డబ్బులు జమ చేయలేదు. సీఎం బటన్ నొక్కినా డబ్బులు జమ కాకపోతే ఎవరిని అడగాలో అర్థం కావడం లేదు. ఎప్పటిలోగా సున్నా వడ్డీ సొమ్ము జమ చేస్తారో ఏమో అర్థం కావడం లేదు. - మల్లికార్జున, గొడిసెలపల్లి, డి.హిరేహాళ్ మండలం





ప్రచారంలో పాల్గొన్న యానిమేటర్, వలంటీర్లు

ప్రచారం చేసేదే..!

బొమ్మనహాళ్, మార్చి 14: రాయదుర్గం నియోజకవర్గంలో వలంటీర్లు, యానిమేటర్లు వైసీపీ ప్రచార బాధ్యతలను మోస్తున్నారు. 'ఏం చేసుకుంటారో చేసుకోండి..' అన్నట్టుగా అధికారులకు సవాలు విసురుతున్నారు. ప్రభుత్వం నుంచి వేతనాలు పొందేవారు రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనకూడదన్న నిబంధనలను ఏమాత్రం ఖాతరు చేయడంలేదు. ప్రతిపక్ష నాయకులు ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బొమ్మనహాళ్ మండలంలోని దేవగిరి, హరేసముద్రం గ్రామాలలో వైసీపీ నాయకుడు మెట్టు విశ్వనాథ రెడ్డి గురువారం ప్రచారం నిర్వహించారు. హరేసముద్రంలో యానిమేటర్ నాగరాజు, గ్రామ వలంటీర్లు రాముడు, సి.వన్నూరుస్వామి, కె.వన్నూరుస్వామి, ఎం.నాగరాజు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. దేవగిరి గ్రామంలో కూడా వలంటీర్లు వైసీపీ ప్రచార కరపత్రాలను చేతపట్టుకుని ఇంటింటికి వెళ్లి అందజేశారు. ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు, యానిమేటర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలిన హరేసముద్రం మాజీ సర్పంచ్ పల్లి తిప్పేస్వామి, టీడీపీ నాయకుడు దివాకర్ డిమాండ్ చేశారు.

బాలికపై లైంగిక దాడి

నార్పల, మార్చి 14: మండల కేంద్రంలోని ఓ కాలనీలో 15 ఏళ్ల బాలికపై పలుమార్లు లైంగికదాడి జరిగింది. బాలిక పొరుగింటిలో ఉంటున్న సుధాకర్ (45) అనే వ్యక్తి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడిని పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. బాలికకు మాయ మాటలు చెబుతూ పలుమార్లు లైంగిక దాడి చేయడంతో ఆమె గర్భం దాల్చింది. కడుపు నొప్పిగా ఉందని చెప్పడంతో బాలికను తల్లిదండ్రులు వైద్యులు దగ్గరకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు, బాలిక గర్భం దాల్చిందని చెప్పారు. దీంతో ఈ వ్యవహారం బయటపడింది. ఈ మేరకు బాలిక తల్లిదండ్రులు నార్పల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుధాకర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. బాలిక 9వ తరగతి చదువుతోంది.



బండమీదపల్లిలో అరకొరగా వేసిన సీసీ రోడ్డు..



ఎస్సీ కాలనీలో ఇలాగే ఉంది..

ఎమ్మెల్యే హామీకి నాలుగు నెలలు

సీసీ రోడ్డు నిర్మాణం ఉత్తిమాటేనా..?

పది రోజులు కాలేదా..?

రాప్తాడు, మార్చి 14: బండమీదపల్లిలో రూ.40 లక్షల సొంత డబ్బుతో మెయిన్ రోడ్డు నిర్మిస్తామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆర్భాటంగా ప్రకటించారు. పార్టీ నాయకులు, ప్రజల సమక్షంలో భూమి పూజ చేశారు. పది రోజుల్లోనే పనులను పూర్తి చేయిస్తామని కూడా అన్నారు. కానీ నాలుగు నెలలు గడిచినా సగం కూడా పనులు కాలేదు. కొంతమేరకు సీసీ రోడ్డు నిర్మించి వదిలేశారు. ఎన్నికల ముందు ప్రచారం కోసమే భూమి పూజ చేశారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. పనులు చేయలేనప్పుడు మాట ఇవ్వడం దేనికని ప్రశ్నిస్తున్నారు. రాప్తాడు మండలంలోని బండమీదపల్లి గ్రామంలో గతేడాది నవంబరు 18న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పర్యటించారు. రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ భవనాలను ప్రారంభించారు. గ్రామంలోని ఉన్నత పాఠశాల వద్ద నుంచి శివాలయం వరకూ మెయిన్ రోడ్డు పనులను రూ.40 లక్షల సొంత నిధులతో చేపడతామని ప్రకటించారు. భూమి పూజ చేసి పనులను కూడా ప్రారంభించారు. శివాలయం వద్ద నుంచి శ్మశానం శివారు వరకూ రూ.12 లక్షలతో మురుగునీటి కాలువల నిర్మాణానికి కూడా భూమి పూజ చేశారు. ఆ సమయంలో 'పది రోజుల్లో పూర్తి చేస్తాం' అని ప్రకటించారు. ఎస్సీ కాలనీలో ట్యాంకు వద్ద నుంచి గ్రామీణ బ్యాంకు వరకూ మాత్రమే సీసీ రోడ్డు నిర్మించారు. ఉన్నత పాఠశాల నుంచి ఎస్సీ కాలనీ వరకూ, బ్యాంకు వద్ద నుంచి శివాలయం వరకూ రోడ్డు నిర్మించాల్సి ఉంది. గ్రామస్థులు అడిగితే.. 'ఇదిగో.. అదిగో..' అని వైసీపీ నాయకులు కాలం గడుపుతున్నారు. డ్రైనేజీ కాలువల పనులను ప్రారంభించనేలేదు. రేపో మాపో ఎన్నికల కోడ్ వస్తుంది. ఇక పనులు పూర్తి చేసేది ఎన్నడు..? అని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



నవంబరు 18న బండమీదపల్లిలో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

పంట.. కంటతడి..!

ఎండిన వరి మడిలో మేస్తున్న గొర్రెలు



కాలం కలిసిరాలేదు. పాలకులు పట్టించుకోవడం లేదు. దీంతో ఇంటికి చేరాల్సిన పంట మూగ జీవాలకు మేతగా మారింది. హెచ్చెల్సీ నీరు రాకపోవడంతో, వర్షాభావం కారణంగా బోర్లలో నీరు అడుగంటుతుండటంతో బొమ్మనహాళ్ మండల రైతులు పంటలను కాపాడుకోలేకపోతున్నారు. ఈ సమస్య చాలదన్నట్లు వ్యవసాయానికి విద్యుత్ సక్రమంగా సరఫరా చేయడం లేదు. తొమ్మిది గంటల విద్యుత్‌ను ఏడు గంటలకు కుదించి, అదీ విడతల వారీగా సరఫరా చేస్తున్నారు. దీంతో వరి పంటలకు తడులు అందక నిలువునా ఎండిపోతోంది. ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన లోకన్న అనే రైతు ఆరు ఎకరాల్లో వరి సాగు చేశాడు. ఇందులో రెండెకరాలను ఇప్పటికే గొర్రెలకు వదిలేశాడు. పత్తి, మొక్కజొన్న పంటలు సైతం ఎండిపోతున్నాయి. రైతులు రూ.కోట్లలో పెట్టుబడిని నష్టపోతున్నారు.

- బొమ్మనహాళ్

ఆ రెండింటిలో ఎవరో?



అర్బన్ సీటు కోసం జనసేన, టీడీపీలో తీవ్ర పోటీ

- జిల్లాలో ఆరు నియోజకవర్గాలకు టీడీపీ అభ్యర్థుల ఖరారు
- గుంతకల్లు, అనంత నియోజకవర్గాలకు ఇంకా ఖరారు కాని వైనం
- ఎంపీ అభ్యర్థులపైనా కొనసాగుతున్న ఉత్కంఠ
- ప్రచారంలోకి దిగిన ఆరు నియోజకవర్గాల అభ్యర్థులు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఖరారు విషయంలో టీడీపీ అధిష్ఠానం ఆచితూచి అడుగేస్తోంది. గెలుపు గుర్రాలకే టికెట్లు ఇవ్వాలనే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో ఆరింటికి రెండు విడతల్లో అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన రెండు నియోజకవర్గాల్లోనే అభ్యర్థుల ఖరారు విషయంలో ఉత్కంఠ నెలకొంది. అందులో ఒకటి అనంతపురం అర్బన్ కాగా... రెండోది గుంతకల్లు నియోజకవర్గం. ఈ రెండు నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఖరారు విషయంలో ఆశావహుల పేరుతో ఇప్పటికే ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టింది. ఆ సర్వేల్లో ఆశావహుల్లో ఎవరిని స్థానిక ఓటర్లు బలపరచారనేది పార్టీ అధిష్ఠానం బహిర్గతం చేయడం లేదు.

- అనంతపురం(ఆంధ్రజ్యోతి)





తొలుత అనంతపురం అర్బన్ నియోజకవర్గం జనసేనకు కేటాయించినట్లు ప్రచారం జరిగింది. ఆ మేరకు ఆ పార్టీ నుంచి జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ ప్రధాన కార్యదర్శి భవానీ రవికుమార్, రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత, సీనియర్ నాయకులు కాయగూరల లక్ష్మీపతి అనంతపురం అర్బన్ టిక్కెట్ కోసం పోటీ పడ్డారు. జనసేన అధిష్ఠానం ఆ మేరకు ఐవీఆర్ఎస్ సర్వే చేయించింది. అనంతపురం అర్బన్ నుంచి టీడీపీ తరపున టిక్కెట్ ఆశిస్తున్న ఆశావహులపైనా ఆ పార్టీ అధిష్ఠానం ఐవీఆర్ఎస్ సర్వే చేయించింది. మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి మరోసారి టిక్కెట్ ఆశిస్తున్నారు. ఆ పార్టీ ముస్లిం మైనార్టీ నాయకులు కేఎం జకీవుల్లా, మహమ్మద్ గౌస్, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం సుబ్రహ్మణ్యం కుమారుడు ఎద్దులవల్లి లలితకృష్ణ, రాప్తాడు మాజీ ఎంపీపీ దగ్గుపాటి ప్రసాద్, ఆ పార్టీ నాయకుడు కొండవీటి సుధాకర్ నాయుడు సతీమణి భావన, ఎన్ఆర్ఐ ఎద్దులపల్లి నిర్మల అనంతపురం అర్బన్ టిక్కెట్ ఆశిస్తున్న వారిలో ఉన్నారు. గుంతకల్లు నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్, పత్తి హిమబిందు ఆ పార్టీ టిక్కెట్ ఆశిస్తున్నారు. అయితే అనూహ్యంగా వైసీపీ నుంచి మాజీమంత్రి గుమ్మనూరు జయరాం ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. గుంతకల్లు నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఆయన ఆసక్తి చూపుతున్నారు. ఇలా ఎవరికి వారు టిక్కెట్ కోసం తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. గురువారం టీడీపీ అధిష్ఠానం 34 మంది అభ్యర్థులతో రెండో జాబితా విడుదల చేసింది. ఆ జాబితాలో ఈ రెండు నియోజకవర్గాల అభ్యర్థుల ప్రకటన లేకపోవడంతో ఆశావహులను మరింత టెన్షన్‌కు గురిచేస్తోంది. నేడోరేపో ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతున్న నేపథ్యంలో ఆశావహులు ఎవరికి వారు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయించుకునేందుకు మంగళగిరిలోనే తిష్టవేయడం గమనార్హం.







ఎంపీ అభ్యర్థిపైనా కొనసాగుతున్న ఉత్కంఠ...



ఉమ్మడి అనంత జిల్లాలో అనంతపురం, హిందూపురం పార్లమెంటు స్థానాలకు కూటమి నుంచి టీడీపీ అభ్యర్థులే ఎన్నికల బరిలో దిగనున్నారు. ఎంపీ అభ్యర్థుల ఖరారు విషయంలోనూ ఉత్కంఠ కొనసాగుతోంది. మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథిని అనంతపురం ఎంపీ అభ్యర్థిగా ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే కొన్ని కారణాల నేపథ్యంలో ఆయన హిందూపురం ఎంపీగా పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈక్రమంలో అనంతపురం ఎంపీగా ఎవరు పోటీ చేస్తారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఉమ్మడి జిల్లాలో కురుబ, బోయ సామాజికవర్గానికి రెండేసి సీట్లు ఇవ్వాలన్నది ఆ పార్టీ అధినాయకత్వం తీసుకున్న నిర్ణయం. ఆ మేరకు హిందూపురం పార్లమెంటు పరిధిలో ఒక అసెంబ్లీ, ఒక పార్లమెంటు, అనంతపురం పార్లమెంటు పరిధిలో ఒక అసెంబ్లీ, ఒక పార్లమెంటు స్థానాన్ని కేటాయించాల్సి ఉంది. ఆ మేరకు ఇప్పటికే పెనుకొండ అసెంబ్లీ స్థానాన్ని కురబ సామాజికవర్గానికి చెందిన సవితకు కేటాయించారు. అనంతపురం పార్లమెంటు స్థానం నుంచి బీకే పార్థసారథి ఎంపీగా పోటీ చేస్తారని ఇప్పటికే ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. అయితే కొన్ని అనూహ్య పరిణామాల నేపథ్యంలో... అనంతపురం పార్లమెంటు నుంచి కాకుండా.. హిందూపురం పార్లమెంటు నుంచి బీకే పార్థసారథి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ఆ వర్గాల ద్వారా అందిన సమాచారం. ఉమ్మడి జిల్లాలోని కొందరు ఆ పార్టీ ముఖ్య నాయకులు బీకే పార్థసారథి నిర్ణయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. పార్టీ అధిష్ఠానం దాన్ని ఆమోదిస్తే హిందూపురం పార్లమెంటు నుంచి బీకే పార్థసారథి ఎంపీగా పోటీ చేసేందుకు అడ్డంకి తొలగినట్లే. దీంతో కురుబ సామాజికవర్గం కోటా పూర్తయినట్లే.

అనంత ఎంపీ స్థానం నుంచి ఎవరో?

ఇక అనంతపురం పార్లమెంటు విషయానికొస్తే... ఎంపీ అభ్యర్థి ఎవరన్నదే ఇప్పటికీ తేలలేదు. బోయ సామాజికవర్గం నుంచి ఎంపీ అభ్యర్థిని రంగంలోకి దింపాలని పార్టీ అధిష్ఠానం ఇప్పటికే కొందరి పేర్లతో ఐవీఆర్ఎస్ సర్వే చేయించింది. అయితే ఇప్పటికే రాయదుర్గం నుంచి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పోటీచేస్తారని అధిష్ఠానం ప్రకటించింది. గుంతకల్లు అసెంబ్లీ స్థానం నుంచి మాజీమంత్రి గుమ్మనూరు జయరాం పోటీ చేస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అక్కడి నుంచి గుమ్మనూరు జయరాంను అసెంబ్లీ అభ్యర్థిగా నిలిపితే... ఎంపీ అభ్యర్థిని ఏ సామాజికవర్గం నుంచి రంగంలోకి దింపుతారనే చర్చ నడుస్తోంది. గుంతకల్లు నియోజకవర్గం నుంచి బోయ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని బరిలో నిలపని పక్షంలో... అనంతపురం పార్లమెంటు అభ్యర్థిగా ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికే ఎంపీ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఒకవేళ గుంతకల్లు నియోజకవర్గం నుంచి బోయ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని బరిలో నిలిపితే... మరో సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని పార్లమెంటు బరిలో నిలపనున్నట్లు సమాచారం.

ప్రచారంలో ఆ ఆరు నియోజకవర్గాల అభ్యర్థులు...



ఇప్పటికే టీడీపీ అధిష్ఠానం జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. దీంతో రాయదుర్గం నుంచి కాలవ శ్రీనివాసులు, రాప్తాడు నుంచి పరిటాల సునీత, ఉరవకొండ నుంచి పయ్యావుల కేశవ్, తాడిపత్రి నుంచి జేసీ అశ్మిత్ రెడ్డి, శింగనమల నుంచి బండారు శ్రావణిశ్రీ, కళ్యాణదుర్గం నుంచి అమిలినేని సురేంద్రబాబు వారి నియోజకవర్గాల్లో ప్రచారాలు ప్రారంభించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి తీసుకెళ్తున్నారు. వైసీపీ అరాచక పాలనను ప్రజల్లో ఎండగడుతూ టీడీపీని ఆశీర్వదించాలని ప్రచారాన్ని ఉధృతం చేస్తూ ముందుకు సాగుతున్నారు.

ఇంకా ఎన్నేళ్లు ఈ నిరీక్షణ?

- 'రివర్స్'లోనూ ముందుకు సాగని టిడ్కో ఇళ్లు
- టీడీపీ మంజూరు చేసిన గృహాలు 50,900
- వైసీపీ కోతేసింది 34,628
- కట్టిస్తామని ప్రకటించిన ఇళ్లు 16,272
- ఐదేళ్లలో కట్టించింది 1024 మాత్రమే
- కట్టిన డిపాజిట్ వెనక్కురాక బాధితుల ఆందోళన
- ఎన్నికల నేపథ్యంలో తాడిపత్రిలో టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవం!



పామిడిలో టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు ఇలా...

అనంతపురం సిటీ, మార్చి 14: టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. గత టీడీపీ పాలనలో ఉమ్మడి జిల్లాలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మొత్తం 59 వేల మందికి ఇళ్లు ఇవ్వాలని రూ. వెయ్యి కోట్లతో పనులు ప్రారంభించారు. సుమారు రూ. 210 కోట్లు విలువ చేసే పనులు చకచక పూర్తయ్యాయి. అయితే 2019లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రావడంతో నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. లబ్ధిదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో రివర్స్ టెండరింగ్ ద్వారా 16,272 ఇళ్లను మాత్రమే నిర్మించి ఇస్తామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. మిగిలిన 34,628 మందికి చెందిన రూ.33 కోట్ల డిపాజిట్‌లను వెనక్కి ఇవ్వడంతో పాటు జగనన్న కాలనీల్లో ఇంటి పట్టా ఇస్తామని ప్రకటించింది. ఈ హామీ ఇచ్చి ఐదేళ్లు కావస్తున్నా అమలుకు నోచుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. 'రివర్స్'లో...

హడావుడి ప్రారంభోత్సవం

వైసీపీ ప్రభుత్వం 16,272 మంది లబ్ధిదారులకు ప్రకటించిన టిడ్కో ఇళ్లను కూడా ఈ ఐదేళ్ల కాలంలో కట్టించి ఇవ్వలేకపోయింది. టిడ్కో ఇళ్ల విషయంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే.. ఎక్కడా కూడా ఆశించిన స్థాయిలో పనులు జరగలేదని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అనంతపురం నగరంతో పాటు తాడిపత్రి, ధర్మవరం మినహా ఇంకా ఎక్కడా నిర్మాణాలు జరగలేదని తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో పునాదులకే పరిమితమయ్యాయి. మరికొన్ని చోట్ల మొండిగోడలు దర్శనమిస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియ ముంచుకొస్తున్న నేపథ్యంలో ప్రజా వ్యతిరేకతను చవిచూడాల్సి వస్తుందని భావించిన ప్రభుత్వం హడావుడిగా తాడిపత్రిలో మంజూరు చేసిన 3008 ఇళ్లలో 1024 టిడ్కో ఇళ్లను ప్రారంభించింది. ఇందులో కూడా 350 మందికి మాత్రమే ఇంటి తాళాలు అందజేసి మమ అనిపించారనే విమర్శలు ఉన్నాయి. ఈ నిర్మాణాల్లో కూడా టీడీపీ హయాంలో చేసిన పనులే ఎక్కువని ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. అధికారిక లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16,272 ఇళ్లను పూర్తి చేయాల్సి ఉండగా..ఈ ఐదేళ్ల వ్యవధిలో కేవలం 1024 ఇళ్లు మాత్రమే పూర్తి చేసింది. ఇదంతా గమనిస్తే టిడ్కో ఇళ్ల విషయంలో వైసీపీ సర్కార్‌ది అంతా ఆర్భాటమేనన్న విషయం అర్థమవుతోంది.

...టిడ్కో ఇళ్ల పనులు ముందుకు సాగడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

టీడీపీ మంజూరు చేస్తే.. వైసీపీ కోతేసింది...


గత టీడీపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారుల నుంచి నామమాత్రపు డిపాజిట్‌ల ద్వారా రూ. 1000 కోట్ల నిధులతో 59 వేల మందికి టిడ్కో ఇళ్లను మంజూరు చేసింది. అయితే తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 34,628 ఇళ్లను కోతేసింది. అంతటితో ఆగకుండా వారు చెల్లించిన రూ.33 కోట్ల డిపాజిట్‌లు వెంటనే చెల్లించి వారందరికి జగనన్న ఇంటి పట్టా ఇస్తామని సీఎం జగన్ హామీలు ఇచ్చారు. ఐదేళ్లు కావస్తున్నా.. మంజూరు చేసిన టిడ్కో ఇళ్లు కట్టిందీ లేదు. లబ్ధిదారులకు డిపాజిట్‌లకు సొమ్ము ఒక్క పైసా చెల్లించిందీ లేదు. కనీసం జగనన్న ఇంటి పట్టా కూడా ఇవ్వకపోవడం బాధిత లబ్ధిదారులను కలవరపెడుతోంది. డిపాజిట్‌ల నగదు కోసం సంబంధిత అధికారులను అడిగితే.. అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారేకానీ.. న్యాయ చేయలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



గుత్తిలో టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు

టిడ్కో ఇల్లు.. డిపాజిట్‌లు రాక...

ఎంతో ఆశగా డిపాజిట్‌లు చెల్లించిన లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల విషయంలో నిరాశే ఎదురైంది. కనీసం చెల్లించిన నగదు కూడా వెనక్కు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. జగనన్న ఇంటి పట్టా కూడా ఇవ్వకపోవడం పట్ల బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా అటు టిడ్కో ఇల్లు రాక.. ఇటు చెల్లించినా డిపాజిట్ రాక బాధితులు ఆందోళన చెందుతున్నారు. పదే పదే కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేదని పలువురు బాధితులు వాపోతున్నారు.



అనంతపురం నగర శివారులో టిడ్కో ఇళ్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టిడ్కో ఇళ్ల పరిస్థితి ఇలా...

- టీడీపీ హయాంలో మంజూరైన ఇళ్ల సంఖ్య : 50,900
- డిపాజిట్‌లు చెల్లించిన వారి సంఖ్య : 59,000
- వైసీపీ కోతేసిన టిడ్కో ఇళ్ల సంఖ్య : 34,628
- డిపాజిట్ వెనక్కి ఇవ్వాల్సిన వారి సంఖ్య : 34,628
- మొత్తం వెనక్కి చెల్లించాల్సిన సొమ్ము : రూ. 33 కోట్లు
- ఇప్పటికి పూర్తయినా టిడ్కో ఇళ్ల సంఖ్య : 1024
- ఇప్పటికి పెండింగ్‌లో : సుమారు 6వేలకు పైగానే...
- టీడీపీ హయాంలో ఖర్చు చేసిన వ్యయం : రూ. 210 కోట్లు
- వైసీపీ హయాంలో ఖర్చు చేసిన వ్యయం : రూ. 135 కోట్లు
- మొత్తంగా ఖర్చు చేసిన వ్యయం : 345 కోట్లు
- మొత్తం టిడ్కో ఇళ్ల ప్రాజెక్టు వ్యయం : రూ.వెయ్యి కోట్లు
- పెండింగ్ బిల్లులు : సుమారు రూ. 70 కోట్లు.

జిల్లా ఎన్నికల అధికారులు వీరే...

అనంతపురం టౌన్, మార్చి 14: జిల్లా స్థాయిలో ఎన్నికలు నిర్వహించే అధికారులను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా గురువారం ప్రకటించారు. అనంత జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టరు గౌతమిని నియమించారు. అలాగే జిల్లా పరిధిలోని ఎనిమిది నియోజకవర్గాలకు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాయదుర్గం నియోజకవర్గానికి ఎస్. కరుణకుమారి(ఆన్‌సెట్ సీఈఓ) ఉరవకొండకు కేతన్‌గార్గ్ (జాయింట్‌కలెక్టరు) గుంతకల్లుకు శ్రీనివాసులురెడ్డి (ఆర్డీఓ, గుంతకల్లు) తాడిపత్రికి రామభూపాల్‌రెడ్డి (ఎస్‌డీసీ, పీఏబీఆర్) శింగనమలకు శ్రీను వెన్నెల (ఎస్‌డీసీ, హెచ్ఎన్ఎస్ఎస్-2) అనంతపురంఅర్బన్‌కు గ్రంధి వెంకటేష్, (ఆర్డీఓ, అనంతపురం) కళ్యాణదుర్గంకు రాణీసుష్మిత, (ఆర్డీఓ, కళ్యాణదుర్గం) రాప్తాడు నియోజకవర్గానికి వసంతబాబు (డిప్యూటీ కలెక్టరు, హెచ్చెల్సీ)లను నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగిసే వరకు వీరు ఈ జిల్లాలో ఎన్నికల అధికారులుగా వ్యవహరించనున్నారు.

సింధనూరు వరకు రైలు పొడిగింపు



రాయదుర్గం, మార్చి 14: యశ్వంత్‌పూర్ నుంచి కారటగి వరకు వెళ్లే 16545 నంబరు రైలును సింధనూరు వరకు పొడిగిస్తూ రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం యశ్వంత్‌పూర్‌లో రాత్రి 8.25కు బయల్దేరి ఉదయం 4 గంటలకు రాయదుర్గంకు చేరుకుని 11 గంటలకు సింధనూరుకు చేరుకుంటుంది. అదే విధంగా 16546 నంబరు గల రైలు సింధనూరులో సాయంత్రం 5.30 గంటలకు బయల్దేరి రాయదుర్గంకు రాత్రి 11.40 గంటలకు చేరుకుని ఉదయం యశ్వంత్‌పూర్‌కు చేరుకుంటుంది. ముఖ్యంగా యశ్వంత్‌పూర్ నుండి కారటగి నుంచి నడిచే సేవలను 20 కి.మీ. పెంచి సింధనూరు వరకు పొడిగించారు.

సైనిక్ స్కూల్ పరీక్షల్లో ఆరో ర్యాంకు

అలిండియా స్థాయిలో మెరిసిన పునీత్‌రెడ్డి



రామగిరి, మార్చి 14: మండలంలోని శ్రీహరిపురం గ్రామానికి చెందిన పునీత్‌రెడ్డి సైనిక్ స్కూల్ అకాడమీ ఎంట్రన్స్‌లో ఆలిండియాలో ఆరో ర్యాంకు సాధించాడు. దక్షిణభారత దేశంలో ఐదు రాష్ట్రాలలో మొదటి స్థానం సాధించాడు. ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ఈ పరీక్షలో 300 మార్కులకు గాను 288 మార్కులు సాధించాడు. దీని పట్ల అతడి తల్లిదండ్రులు రజని, శంకర్‌రెడ్డి ఆనందం వ్యక్తంచేశారు.

ఎమ్మెల్సీ మాతృమూర్తికి సీఎం నివాళి

ఉరవకొండ, మార్చి 14: ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాతృమూర్తి లలితమ్మ భౌతిక కాయానికి సీఎం జగన్మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. వజ్రకరూరు మండలం, కొనకొండ్ల గ్రామానికి సీఎం జగన్ గురువారం మధ్యాహ్నం చేరుకున్నారు. ఎమ్మెల్సీ స్వగృహం వద్ద లలితమ్మ పార్థివదేహంపై పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఆయన సోదరులు ఆదోని, మంత్రాలయం, గుంతకల్లు ఎమ్మెల్యేలు సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు సీతారామిరెడ్డిని , ఇతర కుటుంబ సభ్యులను సీఎం పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం అక్కడి నుంచి తాడేపల్లికి వెళ్లారు.



నివాళులర్పిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

పండ్లతోటల్లో బెట్ట పరిస్థితులపై అధ్యయనం

ఉమ్మడి జిల్లాలో నాలుగు బృందాల పర్యటన

అనంతపురం అర్బన్, మార్చి 14: పండ్ల తోటల్లో బెట్ట పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు అనంత ఉమ్మడి జిల్లాలో ఉద్యాన, ఏపీఎంఐపీ రాష్ట్ర కార్యాలయాల ప్రత్యేక బృందాలు పర్యటించాయి. ఏపీఎంఐపీ ఓఎస్‌డీలు వెంకటేశ్వర్లు, రమేష్, ఉద్యాన శాఖ కమిషనరేట్ అధికారులు వెంకటరావు, రత్నచార్యుల నేతృత్వంలో నాలుగు బృందాలు అనంత ఉమ్మడి జిల్లాలోని 9 మండలాల్లో పర్యటించాయి. గురువారం ఒకటో బృందం సభ్యులు కూడేరు, గార్లదిన్నె, రెండో బృందం నార్పల, యల్లనూరు, పుట్లూరు, మూడో బృందం బత్తలపల్లి, తాడిమర్రి, నాలుగో బృందం సీకేపల్లి, కనగానపల్లి మండలాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో బెట్టపరిస్థితుల నేపథ్యంలో ముదురుతోటల్లో కొన్ని చెట్లు వేరుకుళ్లు సోకి చని పోతున్నట్లు గుర్తించారు. బెట్టపరిస్థితులను తట్టుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. చీనీ, దానిమ్మ, అరటి తదితర ఉద్యాన పంటలకు ఈక్రాప్ చేసుకున్న రైతులకు వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా (వాతావరణ ఆధారిత పంటల బీమా) అందుతుందన్నారు.



చీనీ చెట్లను పరిశీలిస్తున్న ప్రత్యేక బృందం సభ్యులు

20,145 మందికి ఈబీసీ నేస్తం

కలెక్టర్ గౌతమి

అనంతపురం టౌన్, మార్చి 14: జిల్లాలో 20,145 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం కింద ఆర్థిక సాయం మంజూరైనట్లు కలెక్టరు గౌతమి తెలిపారు. గురువారం సీఎం ఈ పథకం కింద లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు విడుదల చేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా లబ్ధి దారులకు రూ.30.21కోట్లు చెక్‌ను కలెక్టరు చేతుల మీదుగా విడుదల చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం 45 ఏళ్ల నుంచి 60ఏళ్ల లోపు మధ్య వయసు ఉండి ఆర్థికంగా వెనుక బడిన అగ్రవర్ణాల మహిళల జీవనోపాధి అవకాశాలు పెంచడం కోసం ఈసాయాన్ని అందిస్తోందన్నారు. ఏడాదికి రూ.15వేలు చొప్పున అందించే ఈ సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, నగరపాలక కమిషనర్ మేఘ స్వరూప్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ధరల చింత

- తగ్గిన చింతపండు ధర
- క్వింటానికి రూ.2 వేలు పడిపోయిన వైనం
- ఆందోళన చెందుతున్న రైతులు

హిందూపురం, మార్చి 14: హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో చింతపండు ధర కొంత తగ్గింది. మార్కెట్ ప్రారంభం నుంచి ఆశించిన మేర ధరలు పలుకుతూ వచ్చాయి. మార్చిలో ధర మరింత పెరగాల్సి ఉండేది. అలాంటిది మార్చి రెండోవారంలోనే క్వింటాపై రూ. 1500 నుంచి రూ. 2వేలదాకా ధరలు తగ్గడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. హిందూపురం వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌కు జిల్లా నుంచే కాక కర్ణాటక నుంచి పెద్దఎత్తున చింతపండు వస్తోంది. ఇక్కడికి కర్పూలీ రకం ఎక్కువగా వస్తుంది. గురువారం మార్కెట్‌లో కర్పూలీ క్వింటా గరిష్ఠంగా రూ.30వేలు పలికింది. హిందూపురం వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌కు కర్పులీ, ఫ్లవర్, బోటురకం చింతపండు వస్తుంది. గురువారం మార్కెట్‌కు వచ్చిన మేలురకం కర్పూలీ క్వింటా రూ.30వేలు పలకగా రెండోరకం రూ.20వేలు, మూడో రకం 18వేలు పలికింది. ఫ్లవర్ క్వింటా రూ.16వేలు, రెండో రకం రూ.14వేలు, మూడో రకం రూ.10వేలు పలికింది. బోటురకం క్వింటా మొదటి రకం రూ.10వేలు, రెండో రకం రూ.5వేలు, మూడో రకం రూ.2600దాకా పలికినట్లు మార్కెట్‌వర్గాలు పేర్కొంటున్నాయి. గతంతో పోల్చుకుంటే కర్పూలీ క్వింటాల్‌పై రూ.2వేలు తగ్గిందని పేర్కొంటున్నారు.

బయట వ్యాపారులు రాలేదంటూ...

సాధారణంగా హిందూపురం వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌కు మార్చినెలలో బయటి నుంచి వ్యాపారులు వస్తారు. ఎందుకంటే మార్చి నుంచి ఏప్రిల్ 15లోపు చింతపండు నాణ్యతగా ఉంటుంది. ఈ సమయంలోనే ఎక్కువగా ఏసీలో నిల్వ ఉంచుతారు. అందుకోసం బయటి నుంచి వ్యాపారులు ఇక్కడికి చేరుకుని కొనుగోలు చేస్తారు. ఇందులో కొందరు స్థానికంగాను, మరికొంతమంది కర్నూలు, చిత్తూరు, తమిళనాడు ప్రాంతాల్లో నిల్వ చేసుకుంటుంటారు. అయితే ఈసారి ఎందుకో మార్చి రెండోవారంలో కూడా బయటి నుంచి వ్యాపారులు రాలేదు. దీనిని సాకుగా తీసుకుని స్థానిక వ్యాపారులు ధరలు తగ్గించినట్లు తెలుస్తోంది.

ఈ ఏడాది ఆలస్యంగా మార్కెట్ ప్రారంభం

ప్రతియేడాది జనవరి మాసంలో సంక్రాంతి పండగకే కొత్త చింతపండు మార్కెట్‌కు రావడంతో అదేరోజు మార్కెట్ ప్రారంభిస్తారు. ఈసారి జనవరి 20పైన మార్కెట్ ప్రారంభించారు. అయినా మార్చి మాసంలో ధరలు తగ్గడం వెనుక కారణాలు ఏంటని రైతులు ఆలోచనలో పడ్డారు. సాధారణంగా రైతులు జనవరి, ఫిబ్రవరి మాసంలో మార్కెట్‌కు పండు తీసుకొచ్చేందుకు సిద్ధమైనా మార్చి మాసంలో అమ్ముకుంటే మంచి ధర వస్తుందని భావిస్తుంటారు. గత ఏడాదికూడా చింతపండు ధరలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. అయితే సీజన్‌లో కాకుండా కొంతమంది వ్యాపారులు, రైతులు, ఏసీ గోదాములో నిల్వ ఉంచుకున్న సరుకును జూలై, సెప్టెంబరు నెలల్లో అధిక ధరలకు అమ్ముకున్నారు.



పురం మార్కెట్‌లో చింతపండు దిగుబడులు

కూలి కూడా గిట్టదు

ప్రస్తుతం చింత చెట్టు నుంచి కాయ దులపాలంటే ఒక కూలీకి రూ.వెయ్యి ఇవ్వాలి. చింతకాయలు ఏరేందుకు రూ.400లు మహిళా కూలీకి ఇవ్వాలి. దులిపిన చింతకాయను పొట్టు ఊడదీసి కట్టికాయ చేసేందుకు కూలీకి రూ.600 ఇవ్వాలి. ఇక కట్టికాయని కర్పూలీ రకం చేసేందుకు కిలోకు రూ.25ఇవ్వాలి. ఇలా కూలీలను లెక్కిస్తే రైతుకుగాని, చింతమాను కొనుగోలుచేసిన వ్యాపారికి గాని మిగిలే పరిస్థితి లేదు. దీనికితోడు గత ఏడాది జూలై నుంచి డిసెంబరులోపు వర్షాలు పడకపోవడంతో దిగుబడి కూడా తగ్గుతూ వచ్చింది. మామూలుగా కొన్ని చింతచెట్ల నుంచి పది కేజీల కట్టికాయ కొడితే 6 నుంచి 7కేజీల కర్పూలీ రావాలి. ఈసారి 5కేజీల నుంచి 5.50కేజీలకు పడిపోయింది. ఈ లెక్కన పది కేజీల కట్టికాయకు రూ.250నుంచి రూ.350దాకా నష్టం వస్తోంది. ఇక మార్కెట్‌కు తీసుకొచ్చిన కూలీలు, కమిషన్‌లు లెక్కిస్తే పెద్దగా లాభం వచ్చేదిలేద రైతులు అంటున్నారు.

జగన్ రాజీనామా చేయాలి

బండారు శ్రావణిశ్రీ డిమాండ్

శింగనమల,మార్చి 14: సంతలో వస్తువులను అమ్మినట్లు.. వైసీపీ నాయకులు ఏపీపీఎస్సీ, డీఎస్సీ పోస్టులు అమ్ముకున్నారని, దీనికి నైతిక బాధ్యత వహించి జగన్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని శింగనమల టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏపీపీఎస్సీలో రూ.150 కోట్ల కుంభకోణానికి వైసీపీ ప్రభుత్వం పాల్పడిందంటూ అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారని, ఈ కుంభకోణానికి బాధ్యులైన ఏపీపీఎస్సీ సెక్రటరీ పీఎస్ఆర్ ఆంజనేయులు, ఛైర్మన్ గౌతమ్ సవాంగ్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. గ్రూప్-1 మెయిన్స్‌లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, ఆ నోటిఫికేషన్ ద్వారా ప్రస్తుతం వివిధ హోదాల్లో ఉన్న 162 మంది నియామకాలను రద్దు చేయాలని, మళ్లీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిందన్నారు. దీనికి కారణమైన సీఎం జగన్ రెడ్డి నైతిక విలువలు విశ్వసనీయత ఉంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

అక్రమాలపై విచారణ చేయించాలి

అనంతపురం కల్చరల్, మార్చి 14 : గ్రూప్-1 మెయిన్స్ 2018లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 2018 గ్రూప్స్ మెయిన్స్ రద్దు చేయాలని, మళ్లీ నిర్వహించాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం ప్రభుత్వ అవకతవకలకు నిదర్శనమన్నారు. మూల్యాంకనంలో అవకతవకలు ఏర్పడ్డాయని అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో మెయిన్స్ పరీక్షనే రద్దు చేసిందని తెలిపారు. ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణలో పూర్తి వైఫల్యం స్పష్టమవుతోందన్నారు. కోర్టుతీర్పు ప్రకారం ఆరు నెలల్లో ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడాలి : ఏఐవైఎఫ్

గార్లదిన్నె, మార్చి 14: విద్యుత్ సరఫరాలో ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనాథ్‌చౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం సీపీఐ ఆధ్వర్యంలో కొప్పలకొండ సబ్‌స్టేషన్ వద్ద ఆ పార్టీ నాయకులు, రైతులు చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. కొప్పలకొండ సబ్‌స్టేషన్ పరిధిలోని పెనకచెర్ల, డ్యాం తదితర గ్రామాల్లోని వ్యవసాయ తోటలకు విద్యుత్ సరఫరా ఇష్టానుసారంగా సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో పండ్ల మొక్కలు ఎండుపోతున్నాయని, చీని, మామిడి తదితర పండ్ల తోటలు ఎండుముఖం పడుతున్నాయని అన్నారు. సమయపాలన పాటించి విద్యుత్ సరఫరా చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులకు దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు విద్యుత్ సరఫరా సక్రమంగా సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలసి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వన్నూరుస్వామి, కిష్ట, రైతులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్రస్థాయి పారా పవర్‌లిఫ్టింగ్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 14: రాష్ట్రస్థాయి పారా పవర్‌లిఫ్టింగ్ ఎంపిక పోటీలు అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 24న ఢిల్లీలో నిర్వహించే జాతీయ స్థాయి పారా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటారని, వివరాలకు 93903 88169, 80741 06154లను సంప్రదించాలని కోరారు.

హెవీ డ్రైవింగ్‌లో శిక్షణ.. ఉపాధి

హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లారీ కోర్సులో శిక్షణ ఇస్తున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. 45 రోజుల ఈ శిక్షణతో పాటు ప్రతి అభ్యర్థికి కస్టమర్లతో వ్యవహరించే విధానం, ప్రథమ చికిత్స, వెహికల్ బేసిక్ రిపేరీ శిక్షణ ఇస్తామన్నారు. 21-45 సంవత్సరాల మధ్య వయసు ఉన్న నిరుద్యోగ అభ్యర్థులు అర్హులని, శిక్షణ అనంతరం ఆర్టీఓ కార్యాలయం సహకారంతో డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించి, లైసెన్సు పొందగలరని అన్నారు. వివరాలకు 9441015323, 7780752418 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

చీనీ కాయలు టన్ను రూ.24 వేలు

అనంతపురంరూరల్ : అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.24 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.16 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 550 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

కార్ల్ మార్క్స్‌కు నివాళి

అనంతపురం కల్చరల్, మార్చి 14 : కార్ల్ మార్క్స్ 141వ వర్ధంతిని స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపంలోని ఎన్టీఆర్ ఆటోస్టాండ్ వద్ద సీపీఎం నగర 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేంద్రకుమార్, నాయకులు ఎన్టీఆర్ శీనా, ప్రకాష్, వెంకటనారాయణ, ఏటీఎం నాగరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు పరమేష్, భీమేష్, భగత్ సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు శివ, సోమప్ప, భాస్కర్, రామకృష్ణ, రామాంజనేయులు, ప్రసాద్, హరి, శీన, ఠాగూర్, వరలావ్ప పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి నివాళి

చెన్నేకొత్తపలి: మండలంలోని బసినేపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చిట్రా ఓబులేసు అనారోగ్యంతో బుధవారం మరణించాడు. టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్‌నారాయణచౌదరి గురువారం ఆ గ్రామానికి చేరుకుని.. మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట టీడీపీ కన్వీనర్ ముత్యాలరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేసు, నాయకులు మాడెం సూర్యనారాయణరెడ్డి, గేటు కిష్టప్ప, గురుప్రసాద్, పార్థసారధి, లక్ష్మీనారాయణ ఉన్నారు.

ఈఈ బాధ్యతల స్వీకరణ

అనంతపురం సిటీ : జిల్లా రోడ్లు భవనాల శాఖ (ఆర్అండ్‌బీ) పరిధిలోని ఎన్‌హెచ్ విభాగం ఈఈగా సుధాకర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. పలువురు డీఈఈలు, జేఈలు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నూతన ఈఈ ఆశాఖ ఎస్ఈని మర్యాదపూర్వకంగా కలిశారు.

వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం

మాజీ మంత్రి పరిటాల సునీత



పరిటాల సునీత సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

ధర్మవరం రూరల్, మార్చి 14: ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం చేశారని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. గురువారం కనగానపల్లి మండలం మద్దలచెరువు తండాకు చెందిన పలువురు గిరిజనులు మాజీ వార్డు మెంబర్ కుమార్ నాయక్, ఎర్రిస్వామినాయక్, రామా నాయక్, లక్ష్మానాయక్, చంద్రానాయక్ వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అనంతపురంలోని తన నివాసంలో పరిటాల సునీత వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించేందుకు ఎస్సీ, ఎస్టీలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, మండల కన్వీనర్ యాతం పోతలయ్య పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర చట్టం చేయాలి



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ, ఐక్య రైతుసంఘాల నాయకులు

అనంతపురం కల్చరల్, మార్చి 14 : కేంద్రంలో మోదీ ప్రభుత్వం పంటలకు కనీసం మద్దతుధర చట్టం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. గురువారం కార్మిక, రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక, రైతుకూలీ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సప్తగిరి సర్కిల్ నుంచి క్లాక్‌టవర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ... మోదీ ఇచ్చిన హామీ, స్వామినాథన్ సిఫారసుల మేరకు పంటలకు మద్దతుధర చట్టం చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని రెండు వందల రోజులకు పెంచి, రోజుకు వేతనం రూ.600 చెల్లించాలని, పట్టణాలకు విస్తరింపజేయాలని అన్నారు. కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా పంట రుణాలు, పంటనష్ట పరిహారం, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. కేరళ ప్రభుత్వం తరహాలో రైతుల పంటలకు రుణ ఉపశమన చట్టం చేయాలని, రైతాంగ ఉద్యమం సందర్భంగా చనిపోయిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల అన్నింటి పరిష్కారంకోసం ఈనెల 14న సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమంలో అన్నివర్గాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, చెన్నప్పయాదవ్, కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరంగయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఏపీ రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు కిష్టా, రాయుడు, సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటనారాయణ పాల్గొన్నారు.

చీనీసాగులో యాజమాన్య పద్ధతులు పాటించండి

గార్లదిన్నె, మార్చి 14: చీనిసాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని కమిషనరేట్ గుంటూరు హార్టికల్చర్ ఏడీ వెంకటరావు రైతులకు సూచించారు. గురువారం మండలంలోని యర్రగుంట్ల, ముకుందాపురం, పెనకచెర్ల తదితర గ్రామాల్లో చీనికి సోకిన వేరుకుళ్లు తెగుళ్ల నివారణపై రైతులకు ఆయన అవగాహన కార్యక్రమం కల్పించారు. చీని, నిమ్మ సాగుకు నీరు తక్కువైనప్పుడు, పనిముట్లు చెట్లకు తగిలినప్పుడు చెట్టు వేర్లు కుళ్లిపోయి తెగుళ్ల వ్యాపిస్తాయన్నారు. పిందెలు, పూత రాలిపోతుంటాయన్నారు. అలాంటి సమయంలో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ముఖ్యంగా వేసవిలో నీరు తక్కువ ఉన్న సమయంలో తోటలకు తెగుళ్ల తొలిదశలో ఉన్న చెట్ల మొదలు చుట్టు ఎండు ఆకులు, వరి, వేరుశనగ పొట్టు, పెసర, మినుము పొట్టుతో 20-30 కేజీలను 2 నుంచి 3 అంగుళాల మందంగా పరిచి నేలలోని తేమను కాపాడుకోవాలన్నారు. తెగుళ్ల తొలిదశలో ఉన్న ఒకటి రెండు వేర్లను కత్తిరించాలన్నారు. సకాలంలో మోతాదులో ఎరువులు వేసుకోవాలని తెలిపారు. సూక్ష్మ లోపాలను సరిచేయడం ద్వారా చెట్టు తెగుళ్లను తట్టుకునే శక్తిని పెంచాలన్నారు. అదేవిధంగా చెట్టు చుట్టు పాదలు తవ్వినప్పుడు వేళ్ల దెబ్బ తగలకుండా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ ఉద్యానవనశాఖ అధికారి నరసింహారావు, హార్టికల్చర్ రాప్తాడు, ఉరవకొండ అధికారులు రత్నకుమార్, నెట్టికంఠయ్య, ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సీజ్

అనంతపురం న్యూటౌన్ : ఆత్మకూరు మండలం ముట్టాల గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 5.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఆ బియ్యాన్ని సీజ్ చేసి ఆత్మకూరు సీఎస్‌డీటీకి అప్పగించామని, కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ ఫణీంద్రనాథ్‌రెడ్డి, ఏఓ వాసుప్రకాష్, సీఎస్‌డీటీ ప్రతిమ పాల్గొన్నారు.

పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

నార్పల: స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఓ నిర్మల గురువారం తెలిపారు. డ్రాప్ అవుట్ విద్యార్థినులు, తల్లిదండ్రులు లేని విద్యార్థినులు 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆత్మకూరు: మండలంలోని సింగంపల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న 12మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు. వారి నుంచి 15 బైక్‌లు, రూ. 1.00 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వడదెబ్బ నివారణపై అవగాహన

అనంతపురం టౌన్ : వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక టీవీఎస్ నగర్‌లో ప్రజాపిత బ్రహ్మాకుమారి విశ్వవిద్యాలయంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ తిరుపతినాయుడు హోమియో మందులు పంపిణీ చేశారు.

ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం



నార్పలలో కేక్ కట్ చేస్తున్న జనసేన పార్టీ నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 14 : జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జయరాంరెడ్డి, సీనియర్ నాయకులు కాయగూరల లక్ష్మీపతి ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. అదే విధంగా ఆ పార్టీ మహిళా జిల్లా కార్యాలయంలో రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

నార్పల : నార్పల శ్రీ సత్యసాయి ధ్యాన మండలిలోని అనాథ శరణాలయం ఈ వేడుకలను నిర్వహించారు. ఆ పార్టీ మండల కన్వీనర్ గంజికుంట రామకృష్ణ కేక్ కట్ చేసి పిల్లలకు పంచారు.





అనంతపురంలో జెండాను ఆవిష్కరిస్తున్న, జయరాంరెడ్డి, కాయగూరల లక్ష్మీపతి, మహిళా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న పెండ్యాల శ్రీలత

విద్యార్థులకు అట్టలు, పెన్నుల పంపిణీ



విద్యార్థులకు అట్టలు, పెన్నులు పంపిణీ చేస్తున్న గట్టు రామకృష్ణారెడ్డి

గార్లదిన్నె, మార్చి 14: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 103 మంది పదో తరగతి విద్యార్థులకు స్కూల్ కమిటీ మాజీ ఛైర్మన్ గట్టురామకృష్ణరెడ్డి, ఆయన కుమారులు గట్టు నిరంజన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి గురువారం అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుంకన్న మాట్లాడుతూ.. గట్టురామకృష్ణరెడ్డి కొన్ని సంవత్సరాలుగా విద్యార్థుల విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నాడన్నారు. పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులు ఇచ్చారని, నాలుగు సంవత్సరాలుగా ఆయన కుమారులు పదో తరగతి విద్యార్థులకు అట్టలు, పెన్నులు పంపిణీ చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్‌రెడ్డి, రామాంజినేయులు, సునంద, ఆదెమ్మ, అనిత పాల్గొన్నారు.

వైద్యకళాశాలకు డాక్టర్ ఎండ్లూరి విరాళం



విరాళం అందజేస్తున్న డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్

అనంతపురం టౌన్, మార్చి 14 : మెడికల్ కళాశాల అభివృద్ధికి ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ రూ. లక్ష విరాళంగా అందజేశారు. తాను పనిచేసిన, తన కుమారుడు డాక్టర్‌గా చదివిన ఆ కళాశాలకు తమవంతుగా ఆ సాయాన్ని వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావుకు గురువారం అందజేశారు.

సూపర్ స్పెషాలిటీకి: సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి స్నేహలత ఆస్పత్రి అధినేత డాక్టర్ అరుణకుమారి దాదాపు రూ 3 లక్షలుకు పైగా విలువ చేసే పరికరాలను తనవంత సాయంగా గురువారం అందజేశారు. వాటిని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌స్పెషాలిటీ డిప్యూటీ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, డాక్టర్లు సుభాష్‌చంద్రబోస్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో 'మాస్టర్ సైనిక్' ప్రతిభ



నిహారిక నివాస్, తోషిత్‌థియోడార్, హావిష్‌చౌదరి, రమాకాంత్‌శివ



లోహిత్‌శ్యాంరెడ్డి　సాహిద్ కమల్　దీక్షిత　షణ్ముగ హర్ష

అనంతపురంరూరల్, మార్చి 14: సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో మండలంలోని విద్యారణ్యనగర్‌లోయరు మాస్టర్ సైనిక్ అకాడమీ విద్యార్థులు సత్తాచాటారు. ఈ పరీక్షలో స్కూల్‌కు సంబంధించిన 17మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు అకాడమీ డైరెక్టర్ కుపేంద్రరావు గురువారం తెలిపారు. జనవరి 28న ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష జరిగిందని, ఇందులో తమ పాఠశాలకు చెందిన నీహారిక నివాస్ (256 మార్కులు), తోషిత్ థియోడార్, హవిష్‌చౌదరి, సహిద కమల్, రమకాంత్‌శివ, మట్ట దీక్షిత, లోహితశ్యాం రెడ్డి, షణ్ముగ హర్ష సత్తాచాటారన్నారు. తద్వారా కలికిరి, కోరుకొండ, కొడగు సైనిక్ స్కూల్‌కు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

సాయం.. చలివేంద్రం..!



వేసవి నేపథ్యంలో నగరానికి వచ్చే ప్రజలు, స్థానికంగా పనులు చేసుకునే కార్మికుల దాహార్తిని తీర్చేందుకు అనంతపురం నగరానికి చెందిన పెయింటర్ గణేష్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సంగమేష్ నగర్‌లో గురువారం దీన్ని ప్రారంభించారు. ఇటీవల విద్యుదాఘాతానికి గురైన పెయింటర్ షేక్షావలికి నిత్యావసర సరుకులను అందజేశారు.

- అనంతపురం సెంట్రల్





పోతలయ్యస్వామి మూలవిరాట్, దాదులూరు పరుషలో కిక్కిరిసిన జనం

దాదులూరులో ఘనంగా పరుష

ధర్మవరంరూరల్, మార్చి 14: దాదులూరు పరుషకు జనం పోటెత్తారు. మూడు రోజుల పరుష కార్యక్రమంలో ప్రధాన ఘట్టమైన గావుల మహోత్సవాన్ని గురువారం వేకువజామునే భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉరుముల శబ్దాలతో ఎనిమిది మంది పోతురాజులు విన్యాసాలు చేసుకుంటూ ఆలయంలో వచ్చారు. అనంతరం పోతలయ్యస్వామి, బంగారు లింగమయ్యస్వామి, చెన్నకేశవస్వామి గుళ్లకు ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. జిల్లా నుంచే కాక కర్ణాటక ప్రాంతం నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో గాజులు, తినుబండరాలు, బొమ్మలు కోనుగోళ్ల చేసేందుకు మహిళలు, పిల్లలు ఆసక్తి చూపారు.

జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారికి సన్మానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 14: జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తిమ్మప్పను ఆయన చాంబర్‌లో జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. తిమ్మప్ప మాట్లాడుతూ.. ఈ నెల 22వ తేదీ వరకు అగ్నివీర్‌గా సైన్యంలో చేరడానికి దరఖాస్తు చేసుకోవడానికి సమయం ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పట్నం ఉమామహేశ్వరరావు, కోశాధికారి తిమ్మారెడ్డి, సభ్యులు జంగంశెట్టి సురేష్, అబ్దుల్ ఖాదర్, రంగారెడ్డి, హంస్సేన్, నాగరాజు, ఇస్మాయిల్, షఫీ, వెంకటరమణరావు, గొల్ల ఈశ్వరయ్య, అల్లాబక్షా, జగన్మోహన్ నాయుడు, కార్యాలయ సిబ్బంది గిరీష్, బాబా ఫక్రుద్దీన్, అనిల్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో కొత్త ఓపీ కౌంటర్లు ప్రారంభం

అనంతపురం టౌన్, మార్చి 14: జిల్లా సర్వజన ఆస్పత్రిలో రోగుల కోసం కొత్తగా ఏర్పాటు చేసిన ఓపీ కౌంటర్లను ఎమ్మెల్యే అనంతవెంకటరామిరెడ్డి, సూపరింటెండెంట్ వెంకటేశ్వరావు, ఆర్ఎంఓ హేమలత గురువారం ప్రారంభించారు. ఈకొత్త ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేయడం వల్ల ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సులభంగా ఓపీ చీటీలు లభిస్తాయని సూపరింటెండెంట్ తెలిపారు.

ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

రాప్తాడు, మార్చి 14: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు విమర్శించారు. మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో ఉపాధి కూలీలు చేస్తున్న పనులను గురువారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేసి బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలన్నారు. కూలీలకు వేసవి అలవెన్సులు ఇవ్వాలన్నారు. కూలీలకు పనులు లేక వలసలు వెలుతున్నారని, పని దినాలు 200 రోజులకు పెంచాలని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుబంధం చేయాలన్నారు. గట్లు, చెక్‌డ్యాంల పనులు తిరిగి ప్రారంభించాలన్నారు. కూలీలకు పనిముట్లు పంపిణీ చేయాలన్నారు. వేసవిలో ప్రదేశంలో నీడ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వెంకట్రాముడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ మునీంద్ర, కూలీలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి, మార్చి 14: గుర్తుతెలియని యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. చెన్నేకొత్తపల్లి సమీపంలోని రిజర్వుఫారెస్టు ఏరియాలో ఓ చెట్టుకు ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న గురువారం పోలీసులకు సమాచారం అందింది. ఆ యువకుడి సుమారు 30 సంవత్సరాలు ఉంటాయని, ఆత్మహత్య చేసుకొని సుమారు ఏడు రోజులై ఉండటంతో శరీరమంతా కుళ్లి.. గుర్తించడానికి వీలు కాకుండా ఉందని తెలిపారు. పక్కన ఉన్న యువకుడి బ్యాగులో తమిళనాడు విల్లాపురం గ్రామానికి చెందిన బస్సు టికెట్ ఉందన్నారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. ఆ యువకుడి ఆచూకీ తెలిసిన వారు 94407 96836, 94407 96835 నెంబర్లకు తెలియజేయాలని కోరారు.



గంగలకుంటలో...



కురుకుండ్ల కాలనీలో...

గ్రామాల్లో టీడీపీ విస్తృత ప్రచారం

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : మాజీ మంత్రి పరిటాల సునీత సోదరుడు, రాప్తాడు మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి ఆధ్వర్యంలో రాప్తాడు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే రామ గిరి మండలంలోని కురుకుండ్ల కాలనీ, రామగిరి, ఏడుగుర్రాలపల్లి, మాదాపురం, ఆత్మ కూరు మండలంలో గొరిదిండ్ల, గొరొదిండ్ల తండా, కనగానపల్లి మండలంలోని కొండపల్లిలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



గొరిదిండ్లలో...



కొండపల్లిలో...

టీడీపీలోకి చేరిక


టీడీపీ తీర్థం పుచ్చుకున్న సాదిక్

ఉరవకొండ, మార్చి 14: కమ్యూనిస్టు పార్టీ నాయకుడు సాదిక్ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సమక్షంలో టీడీపీలోకి చేరారు. మండలంలోని కౌకుంట్ల గ్రామంలో గురువారం ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశులు, నాగేంద్ర, రాజశేఖర్, రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాతృమూర్తికి నివాళి


నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కేశవ్

ఉరవకొండ: ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాతృమూర్తి లలితమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ గురువారం నివాళులు అర్పించారు. కొనకొండ్లలో లలితమ్మ పార్థీవ దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి అనంతరం ఎమ్మెల్యేలు సాయి ప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డిలను ఓదార్చారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మనోధైర్యంగా ఉండాలన్నారు. అలాగే గవిమఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి నివాళులర్పించారు. పలువురు వైసీపీ ఎమ్మెల్యేలు శంకరనారాయణ, ప్రకాష్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి నివాళులు అర్పించారు.

'టీడీపీకి మద్దతు ఇవ్వండి'

ఉరవకొండ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే తనయులు విజయ్‌సింహా, విక్రమ్‌సింహా పేర్కొన్నారు. నియోజకవర్గంలోని చాయాపురం, మూలగిరిపల్లి, చిన్నముష్టూరు గ్రామాల్లో వేర్వేరుగా బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధితోపాటు సంపద సృష్టించాలంటే చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల వలన కలిగే లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, గోవిందు, నెట్టెంరాంబాబు, వెంకటేష్, పులీంద్ర, నాగరాజు, నాగభూషణం, మనోహర్, రఘు, రమేష్, అనంతయ్య, కమలపాడు ప్రభాకర్ పాల్గొన్నారు.

మహిళాశక్తికి వందనం

కరస్పాండెంట్ కేసీ హరికుమార్



మాట్లాడుతున్న కరస్పాండెంట్ కేసీ హరికుమార్

గుంతకల్లుటౌన్, మార్చి 14: మహిళా శక్తికి వందనం, మీ భాగస్వామ్యమే దేశానికి ముఖ్యం అని శ్రీశంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్, టీడీపీ కౌన్సిలర్ కేసీ అనురాధ పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో గురువారం కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీ హరికుమార్ మాట్లాడుతూ మానవజాతికి మహిళ ఒక వరం అని, సమాజంలో మహిళల సేవలు వెలకట్టలేనివని అన్నారు. విద్యార్థినులు ఉత్తమ లక్ష్యాలతో ఆదర్శ మహిళలుగా ఎదగాలన్నారు. కేసీ అనురాధ మాట్లాడుతూ మహిళలు లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల మహిళా సాధికారిత విభాగం కన్వీనర్ వెంకటసుబ్బమ్మ, సభ్యులు డాక్టర్ శ్రావణి, డాక్టర్ సుభాషిని, వాణి, భారతి, వరలక్ష్మి, లాస్య, తెలుగు అధ్యాపకులు బసెట్టి క్రిష్ణయ్య, కళాశాల పరిపాలన అధికారి డాక్టర్ చంద్రశేఖర్, కార్యాలయ పర్యవేక్షకుడు రాఘవేంద్ర, అధ్యాపకులు డాక్టర్ సురేష్‌బాబు, టీ వెంకటరమణ, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ గోపి పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

ఉరవకొండ, మార్చి 14: పట్టణంలోని టవర్‌క్లాక్ కూడలిలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహ ఏర్పాటుకు ఆ సంఘం నాయకులు గురువారం భూమిపూజ చేశారు. స్వాతంత్ర్య పోరాట యోధుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వడ్డెర్లంతా కలిసికట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు గంగాధర్, భీమేష్, కుళ్లాయప్ప, రామాంజినేయులు, ధనుంజయ, మల్లికార్జున, హంపయ్య లాల్‌స్వామి పాల్గొన్నారు.

'రైతు రుణాలను మాఫీ చేయాలి'

గుంతకల్లుటౌన్, మార్చి 14: రైతుల రుణాలను మాఫీ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఢిల్లీలో రైతులు చేస్తున్న పోరాటానికి సంఘీభావం తెలుపుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక పొట్టిశ్రీరాముల సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలంటే మోదీని ఓడించాలన్నారు. కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బీ శ్రీనివాసులు, డీ శ్రీనివాసులు, రైతు సంఘం మండల కార్యదర్శి దాసరిశ్రీనివాసులు, సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కసాపురం రమేష్, సాకే నాగరాజు, మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.

'ముస్లింలు రాజకీయ నాయకులుగా ఎదగాలి'

గుంతకల్లుటౌన్, మార్చి 14: ముస్లింలు రాజకీయ నాయకులుగా ఎదగాలని వక్తలు పేర్కొన్నారు. స్థానిక ఇంటర్‌నేషనల్ హ్యూమెన్ రైట్స్ మీడియా ఆర్గనైజేషన్ కార్యాలయంలో గురువారం ముస్లింల రాజకీయ స్థితిగతులపై ముస్లింలు, జకాత్‌కమిటీ, జనజాగరణ కమిటీ సభ్యులు, మైనార్టీ నాయకులు చర్చించారు. సమావేశంలో మైనార్టీ నాయకులు సిమెంట్ వలి, ఆలం నవాజ్ మాట్లాడుతూ తమకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు నజీర్‌సాబ్, అల్లాబకాష్, షేక్ జాఫర్, అన్వర్‌బాష, కుమార్, రామాంజినేయులు, అక్బర్‌బాష, జిలాన్, సర్దార్‌బాష పాల్గొన్నారు.

'రైతాంగాన్ని ఆదుకోవాలి'

పామిడి, మార్చి 14: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రెవెన్యూ అధికారులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతుల రుణాలను మాఫీ చేయాలన్నారు. కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద రూ. 2లక్షల కోట్లు నిధులు కేటాయించి, 200 రోజులు పని దినాలను పెంచాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు ఆనిమిరెడ్డి, మండల కార్యదర్శి మల్లేష్, ముత్యాలు, ఈశ్వరయ్య, కిష్టయ్య, బాబావక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: రైతులను వైసీపీ ప్రభుత్వం నట్టేట ముంచిందని సీపీఐ నాయకులు నాగార్జున, కొట్రేష్ అన్నారు. గురువారం బొమ్మనహాళ్ మండలంలోని ఉద్దేహాళ్, శ్రీనివాస్‌క్యాంప్ గ్రామ శివార్లలో ఎండిపోయిన వరి, పత్తి పంటలను పరిశీలించారు. బొమ్మనహాళ్ మండలంలో ఏడుగంటలు విద్యుత్ సరఫరా ఇవ్వడం ఏమిటని సీపీఐ నాయకులు మండిపడ్డారు. పంటలు ఎండిపోతున్నాయన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండండి: కలెక్టర్


ఏర్పాట్లపై జేసీతో చర్చిస్తున్న కలెక్టర్

ఉరవకొండ, మార్చి 14: ఎన్నికల నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, స్ట్రాంగ్ రూంలలో అన్ని ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఎన్నికల కోసం ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌లలో ఏర్పాట్లను గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్, ఈవీఎం కోసం త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లో పెయింటింగ్ పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల కోసం అన్ని విధాల సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జేసీ కేతన్‌గార్గ్, ఈఆర్వో శిరీష, ఆర్డీవో శ్రీనివాసులు రెడ్డి, డీఈవో వరలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, తహసీల్దారు శ్రీనివాసులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అండతో అధికారంలోకి వస్తాం

- టీడీపీ అభ్యర్థి కాలవ

కణేకల్లు, మార్చి 14: అన్ని వర్గాల అండతో వచ్చే ఎన్నికలలో అధికారంలోకి వస్తామని టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో పలు వార్డులలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి మద్దతు కోరారు. అనంతరం మాట్లాడుతూ అన్ని వర్గాలు తమ పార్టీకి మద్దతు తెలుపుతున్నాయని, వారి సహకారంతో తప్పక గెలుస్తామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, వేలూరు మరియప్ప, గుండాల హనుమంతరెడ్డి, షేక్‌ఫక్రుద్దీన్, బీటీ రమేష్, రాఘవేంద్ర గుప్తా, ఆది, కోకుర్తి సుదర్శన్, ఎస్‌కే మల్లికార్జున, బసవరాజు, చాంద్‌బాషా, చంద్రశేఖర్‌గుప్తా, మాబుసాబ్, అనిల్, వెంకటేశులు, కురుబ నాగరాజు, షేక్ ముజ్జు, గౌస్, ఈరప్ప, ప్రభాకర్, నరేష్, శరభనగౌడ్, జయరామచౌదరి, ఎంపీటీసీ నరేంద్ర, కృష్ణారెడ్డి, అంజిబాబు, విజయ్, వరుణ్, ప్రకాష్, కొట్రేగౌడ్, జయశీలారెడ్డి పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

24 గంటల్లో సొంతగూటికి...

రాయదుర్గం: వైసీపీ తీర్థం పుచ్చుకున్న టీడీపీ కార్యకర్తలు 24 గంటల్లో సొంతగూటికి చేరుకున్నారు. ఆ 36 కుటుంబాలు గురువారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. జుంజురంపల్లి గ్రామానికి చెందిన నరేష్, రామాంజి, వెంకటేశులు, కావలి గురుస్వామిలతో పాటు మరో 30 కుటుంబాలను కణేకల్లులో ఎన్నికల ప్రచారం సాగిస్తున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు టీడీపీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వైసీపీ నాయకులు తీవ్ర ఒత్తిడి చేసి ప్రలోభాలకు గురి చేయడంతో తట్టుకోలేక తాము వైసీపీలోకి చేరామని తెలిపారు. దీంతో వెంటనే తేరుకొని తన తప్పిదాన్ని గుర్తించి గురువారం టీడీపీలోకి చేరామన్నారు.


కణేకల్లులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ అభ్యర్థి కాలవ

అధికారంలోకి రాగానే సూపర్‌సిక్స్ పథకాల అమలు: కాలవ భరత్

రాయదుర్గంరూరల్: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అర్హులందరికీ అందుతాయని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ పేర్కొన్నారు. మండలంలోని ఆయతవల్లి గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాలని, రాయదుర్గం నియోజకవర్గానికి కాలవ శ్రీనివాసులును ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతు, మాజీ జడ్పీటీసీ విజయకుమార్, మాజీ సర్పంచ్ గురుసిద్ధప్ప, మాజీ ఎంపీటీసీ పురుషోత్తం, నాయకులు కాటా వెంకటేశులు, జనార్దన్‌రెడ్డి, తిప్పేస్వామి, ప్రసాద్, వన్నూరప్ప, వీరేష్, తిమ్మారెడ్డి, అంజినేయులు పాల్గొన్నారు.

కదంతొక్కిన తెలుగు తమ్ముళ్లు

భారీ ర్యాలీ: యల్లనూరు, పుట్లూరులో అరాచకపాలన: శ్రావణిశ్రీ

యల్లనూరు, మార్చి 14: మండలంలో గురువారం టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో తెలుగుతమ్ముళ్లు కదంతొక్కారు. శింగనమల నియోజకవర్గ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీతోపాటు ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి ఆధ్వర్యంలో బీసీ కాలనీ నుంచి పెద్దమ్మ ఆలయం వద్దకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ యల్లనూరు, పుట్లూరు మండలాల్లో నేటికి అరాచకపాలన సాగుతోందని ఈ పాలనను అంతమొందించాలంటే కచ్చితంగా టీడీపీ అధికారంలోకి రావాల్సిందేనని తెలిపారు. టీడీపీ అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు మాట్లాడుతూ విభేదాలను మరచి పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి ఈశ్వర్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు చూసి వైసీపీ నాయకులు భయపడుతున్నారని తెలిపారు. మండల టీడీపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధే తప్ప ఈ ఐదేళ్లలో అభివృద్ధి జరగలేదన్నారు.

పుట్లూరు: మనస్పర్థలు పక్కనబెట్టి సమష్టిగా కృషిచేసి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండలంలోని కడవకల్లు గ్రామంలో గురువారం నాయకులు, కార్యకర్తలతో ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, కేశవరెడ్డిలతో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ పాలనలో అభివృద్ధి ఎక్కడా జరగలేదన్నారు. ఆలం నరసానాయుడు, కేశవరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో విభేదాలు లేకుండా పార్టీకోసం పనిచేయాలని సూచించారు. అంతకుముందు నాయకులు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రామలింగారెడ్డి, వెంకట నరసనాయుడు, సుదర్శన్‌నాయుడు, చవ్వా కులశేఖరరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, రవిచంద్రనాయుడు, శ్రీనివాసులునాయుడు, జయుడు, రాజేష్, నాగేశ్వరరెడ్డి, గోవర్ధన్‌రాజు, సోము, చంద్ర, దస్తగిరి, సత్య, రామచంద్రారెడ్డి, రవికుమార్‌రెడ్డి, రామాంజనేయులు, రామానాయుడు, భాస్కర్‌నాయుడు, పెద్దిరాజు పాల్గొన్నారు.



కడవకల్లు గ్రామంలో మాట్లాడుతున్న బండారు శ్రావణిశ్రీ

చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఉరవకొండ, మార్చి 14: పట్టణంలోని గవిమఠంలో వెలిసిన చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు, గణపతి, రుద్రహోమాలను నిర్వహించారు. గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ ఆధ్వర్యంలో కంకణధారణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గవిమఠం ఆవరణం నుంచి గంగాజలాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి కంకణ మండపంలో మట్టి కుండల్లో మట్టిని వేసి నవధాన్యాలను ఉంచారు. రథోత్సవం ప్రారంభం నుంచి వసంతోత్సవం వరకు ఆ మట్టికుండలలో మొలకెత్తే ధాన్యాలను బట్టి పంటలు పండుతాయని భక్తులు విశ్వసిస్తారు. కార్యక్రమంలో గవిమఠం ఏజెంట్ రాజన్నగౌడ్, సిబ్బంది నారాయణస్వామి, మధు, రఘు, వెంకటేశులు వీరశైవ సంఘం నాయకులు వీరప్ప పాల్గొన్నారు.

వైభవంగా సుంకలాపార్వతిదేవి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉరవకొండ: విడపనకల్లు మండలంలోని పాల్తూరు గ్రామంలో గురువారం సాయంత్రం సుంకలా పార్వతిదేవి రథోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తిని రథంపై ఉంచి ఆలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు రథోత్సవాన్ని నిర్వహించారు. రథంపైకి భక్తులు అరటిపండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రథాన్ని యథాస్థానానికి చేర్చారు.

చెన్నకేశవస్వామి హుండీ ఆదాయం రూ. 1.68లక్షలు

యాడికి: లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,68,602 వచ్చినట్లు ఆలయ ఈఓ దుర్గాప్రసాద్ తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో స్వామివారి హుండీ డబ్బులను లెక్కించారు. గత ఏడాది నుంచి ఇప్పటివరకు ఆలయ హుండీని లెక్కించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు హరికృష్ణశర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, గ్రామస్థులు చౌదరి, నాగరాజు, పరమేశ్వర్‌రెడ్డి, కుళ్లాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

- గుమ్మనూరు నారాయణ

పామిడి, మార్చి 14: అనారోగ్యానికి మృతి చెందిన వారి కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటున్న మాజీ వార్డుమెంబర్ ఆదినారాయణ, వాణినగర్‌లో నివాసం ఉంటున్న ఓబన్న మృతి చెందడంతో గురువారం ఆయన ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ. 20 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌చౌదరి, మాజీ ఎంపీటీసీ జింకల సంజీవకుమార్, వివిధ్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షులు అప్పన్నగారి కుమార్, మాజీ వార్డు మెంబర్లు పిక్కిలి రంగనాయకులు, హమాలీ గోపాల్, నాయకులు తిమ్మప్ప, ఓబులేసు, రవి, నాగరాజు, ఆశోక్ ఉన్నారు.

చిరుత దాడిలో ఆవుదూడ మృతి

కూడేరు, మార్చి 14: మండలంలోని కల్లగళ్ల గ్రామంలో రైతు ఎరికల శేకప్ప తోటలో ఉన్న ఆవుల మందపై చిరుత దాడి చేసింది. దాడిలో ఆవుదూడ మృతి చెందింది. బుధవారం రాత్రి తోటలో ఉన్న ఆవుల మందపై చిరుత దాడి చేయడంతో అవి పరుగులు తీశాయి. కాగా చిరుత దాడిలో ఆవుదూడ మృతిచెందింది. తోటలో రైతు ఒక్కడే ఉండటంతో భయానికి గురయ్యాడు. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుత నుంచి తమను రక్షించాలని పరిసరప్రాంతాల రైతులు కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్థులు

పెద్దవడుగూరు, మార్చి 14: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని గురువారం టీడీపీ నాయకులు, గ్రామస్థులు అడ్డుకున్నారు. ఇసుక అక్రమ రవాణాతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని, విద్యుత్‌స్తంభాలుసైతం నేలకొరుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన చెందారు. వాహనాన్ని అడ్డుకున్న వారిలో టీడీపీ మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, ఐటుకనాల, సర్పంచు ఆది, నరేంద్ర రెడ్డి, రంగప్ప, పుల్లారెడ్డి, బాలరాజు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో అమిలినేని ప్రచారం


అమిలినేని సురేంద్రబాబును గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

కళ్యాణదుర్గం, మార్చి 14: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గురువారం కళ్యాణదుర్గం మండల పరిధిలోని ఓబుళాపురం, మానిరేవు, నుసికొట్టాల, నుసికొట్టాల తండా, కదరకుంట, కదరంపల్లి, దానంపల్లి, బోయలపల్లి, కామక్కపల్లి, నారాయణపురం, గాజులపల్లిలో పెద్ద ఎత్తున ప్రచారాన్ని చేపట్టారు. ఆయా గ్రామాల్లో ఆయనకు అపూర్వ స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే బీటీపీని సకాలంలో పూర్తి చేసే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. ప్రతి గ్రామానికి సాగు, తాగు ఇవ్వడమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతానన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు అభివృద్ధి బాటలో నడవాలంటే ఒక్క టీడీపీతోనే సాధ్యం అవుతుందని స్పష్టం చేశారు. భావితరాల భవిష్యత్తు బాగుపడాలంటే చంద్రబాబునాయుడు సీఎం కావాలన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ఎంతగానో దోహదపడతాయన్నారు. ఏ గ్రామంలో చూసినా టీడీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళల అభ్యున్నతి

ప్రచారంలో అమిలినేని భార్య, కుమారుడు, కోడలు


కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో ప్రచారం చేస్తున్న అమిలినేని సురేంద్రబాబు భార్య, కోడలు

టీడీపీతోనే మహిళా అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ దిశగా విజయానికి అహర్నిశలు కృషి చేద్దామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు తనయుడు అమిలినేని యశ్వంత్ అన్నారు. గురువారం కళ్యాణదుర్గం మున్సిపాల్టీ పరిధిలో 7,8,9 వార్డుల్లో అమిలినేని సురేంద్రబాబు భార్య రమాదేవి, కోడలు ఇషిత ఇంటింటికి వెళ్లి ప్రచారాన్ని చేపట్టారు. సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించి మహిళలకు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వార్డుల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ


కాలనీవాసులతో జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి 14: పట్టణంలోని 3, 4 వార్డుల్లో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ జరిగింది. కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి మినీఫెస్టో గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ అబ్దుల్‌రహీం, కౌన్సిలర్లు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలంలోని కిష్టిపాడు గ్రామంలో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహించారు. జేసీ అశ్మిత్‌రెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, దాదాఖలందర్, భోగేశ్వర్‌నాయుడు, హాజీబాబా, చిరంజీవులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఎన్నికల నియమావళి అమలు చేయాలి'

గుత్తి, మార్చి 14: ఎన్నికల నియమావళిని సిబ్బంది తప్పనిసరిగా అమలు చేయాల్సివుంటుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల నియమావళి, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు చేసే విషయంపై మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బందితో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నియమావళిని అనుసరించి సిబ్బంది, అధికారులు పాటించాల్సిన మార్గదర్శకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మురళీధర్, టీపీఎస్ మహబూబ్‌జాన్, సచివాలయ క్లర్క్ ఇమామ్‌హుసేన్, ఆర్వో వెంకటరెడ్డి, డీఈ రఘు, ఆర్‌ఐ షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

జీడిపల్లి రిజర్వాయరుకు 499 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, మార్చి 14: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 499 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు గురువారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో కింద 499 క్యూసెక్కులు వస్తుండగా ఇక్కడి నుంచి ఫేజ్-2కు ఔట్‌ఫ్లో కింద 400 క్యూసెక్కులు వెళుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో 0.483 టీఎంసీల నీటి నిల్వ వుందన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 14: ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. కంబదూరు నుంచి ప్రయాణికులతో కళ్యాణదుర్గం వస్తున్న ఆటోను అండేపల్లి సమీపంలో వెనుక నుంచి గుర్తుతెలియని లారీ ఢీకొట్టడంతో ఆటోలో ఉన్నపలువురికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. మెరుగైన చికిత్స కోసం రవి, మారెక్క, గంగమ్మను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కంబదూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు గాయాలు

యాడికి: ట్రాక్టర్, బైక్ ఢీకొన్న సంఘటనలో పిన్నేపల్లి గ్రామానికి చెందిన నాగకృష్ణమ్మకు తీవ్రగాయాలయ్యాయి. పిన్నేపల్లి గ్రామానికి చెందిన నాగకృష్ణమ్మ భర్తతో కలిసి ద్విచక్రవాహనంలో యాడికి వెళుతోంది. పిన్నేపల్లి రోడ్డులోని హౌసింగ్‌కాలనీ వద్ద విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న ట్రాక్టర్ వచ్చి బైక్‌ను ఢీకొనడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను యాడికి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తాడిపత్రికి తరలించారు.

రేపు వైద్య శిబిరం

రాయదుర్గం, మార్చి 14: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు పట్టణంలోని సవితా క్యాంద్ర భవన్‌లో మూర్ఛవ్యాధి చికిత్స శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి కెంచె లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు జగదీష్ తెలిపారు. నరాల స్పెషలిస్టు డాక్టర్ గోపాలం శివన్నారాయణ చికిత్స అందిస్తారని, బాధితులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

15 మద్యంబాటిళ్లు స్వాధీనం

యల్లనూరు, మార్చి 14: మండలంలోని తిమ్మంపల్లి గ్రామంలో గురువారం నాగరాజు నుంచి 15మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ గిరిబాబు తెలిపారు. సమాచారంతో దాడిచేసి నాగరాజును అరెస్ట్‌చేసి కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

12 ప్యాకెట్ల రేషన్ బియ్యం సీజ్

తాడిపత్రిటౌన్: పట్టణంలోని నందలపాడు సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గురువారం 12ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని సీజ్‌చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి సాయిని అరెస్ట్‌చేసి బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను సీజ్‌చేశామని తెలిపారు.

నిధులు పంచాయతీవి.. గొప్పలు వైసీపీ నాయకులవి..

బొమ్మనహాళ్, మార్చి 14: మండలంలో పలు గ్రామాల్లో పంచాయతీ, మండల పరిషత్ నిధులతో తాగునీరు బోర్లు, పైపులైన్లు వేయించగా రాయదుర్గం వైసీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి వేసినట్లు వాట్సప్ గ్రూపులలో జోరుగా ఆ పార్టీ నాయకులు ప్రచారం సాగిస్తున్నారు. మండలంలోని లింగదహాళ్ గ్రామంలో రూ. 4.5 లక్షల ఖర్చులతో గ్రామపంచాయతీ నిధుల ద్వారా బోరు వేసి మోటారు, పైపులైన్ వేశారు. మండలపరిషత్ నిధులతో బండూరు గ్రామంలో గ్రామ పంచాయతీ నిధులు రూ. రెండు లక్షలు వెచ్చించి బోరు వేశారు. దర్గాహొన్నూరులో రెండు బోర్లు, బొల్లనగుడ్డంలో ఒకటి, ఉంతకల్లులో పంప్‌సెట్టు, పైపులైన్, తార్కాపురంలో పైపులైన్, రంగాపురం క్యాంపులో మోటారు, పైపులైన్, పంపసెట్టు గ్రామ పంచాయతీ నిధులతో తాగునీటి సౌకర్యం కోసం వెచ్చించారు. ప్రచారం మాత్రం మెట్టు గోవిందరెడ్డి బోర్లు వేయించి ఆయా గ్రామాలలో తక్షణమే తాగునీటి సమస్య తీర్చారని ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ చైతన్యకుమార్‌ను వివరణ కోరగా గ్రామపంచాయతీ, మండల పరిషత్ నిధులతో తాగునీటి సౌకర్యం కోసం బోర్లు, పంపసెట్లు, పైపులైన్లు వేయించినట్లు తెలిపారు.